నిరుపేదల భవితకు
బంగారు విజన్
● రెండు కుటుంబాల మొర ఆలకించిన సీఏం
● పిల్లల చదువుకు ముందుకొచ్చిన మార్గదర్శులు
- 6లో

స్వచ్ఛ తిరుపతి



కపిలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న చంద్రబాబు

దేశానికి ఆదర్శం కావాలి!

శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ జలాలు

తిరుపతి ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దేశానికంతా పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి స్వచ్ఛతలో కూడా దేశానికి ఆదర్శం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజా వేదికలో మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం సూపర్ సిటీస్ కేటగిరీలో తిరుపతికి ఉత్తమ అవార్డు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచీ కూడా భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వస్తున్న నేపథ్యంలో నగరంలో పరిశుభ్రత ప్రతిఫలించాలని సూచించారు. నగరం శుభ్రంగా లేకుంటే భక్తులకు తిరుపతి మీద సదభిప్రాయం కలగదని హెచ్చరించారు. అవార్డుల్లో ఫైవ్ స్టార్ ర్యాంకింగ్ సాధించిన తిరుపతి భవిష్యత్తులో సెవెన్ స్టార్ ర్యాంకింగ్ సాధించాలని పిలుపునిచ్చారు.

రూ. 150 కోట్లతో మోడల్ సిటీగా తిరుపతి

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద పలు పనులు మిగిలిపోయాయని చంద్రబాబు గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టు కింద పలు రోడ్లు, డ్రైయిన్ పనులు పెండింగులో వున్నాయన్నారు. రూ. 150 కోట్లతో తిరుపతిని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. దివ్యక్షేత్రంగా వున్న తిరుపతిని విద్యా కేంద్రంగానూ, నాలెడ్జి ఎకానమీ హబ్‌గానూ అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీవారి పాదాల చెంత వివాహాలు చేసుకునే విధంగా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మారుస్తామన్నారు. దానికోసం ఉత్తమ మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

జిల్లా రుణం తీర్చుకుంటా!

రూ. 3850 కోట్లతో 550 కిలోమీటర్ల మేరకు కాలువ తవ్వించి కుప్పం వరకూ హంద్రీ-నీవా జలాలు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తిరుపతి జిల్లాలో మల్లిమడుగుకు నీరు తెస్తామని, బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి దానికి నీటిని మళ్ళిస్తామన్నారు. సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా నీటిని బాలాజీ రిజర్వాయర్‌కు తరలిస్తామన్నారు. అక్కడి నుంచి కాలువలు తవ్వించి మధ్యలో వేణుగోపాల సాగర్ నిర్మిస్తామని, ఆ రిజర్వాయర్ నింపడంతో పాటు హంద్రీ-నీవా జలాలను పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుకు చేరుస్తామన్నారు. అదే విధంగా మంగళంపేట నుంచి మూలపేట చెరువు మీదుగా కళ్యాణి డ్యామ్‌కు నీరివ్వడం ద్వారా శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ నీవా నీరు తెస్తామన్నారు. ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి జిల్లా రుణం తీర్చుకుంటానని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

కపిలేశ్వరాలయంలో 'స్వచ్ఛాంధ్ర'

పారిశుధ్య కార్మికులతో కలసి చెత్త ఊడ్చిన సీఎం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతిలోని కపిలేశ్వరాలయంలో పారిశుధ్య కార్మికులతో కలసి సీఎం చంద్రబాబు చెత్త ఊడ్చారు. ఆలయాన్ని శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో సరదాగా ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి నిత్యం లక్షమంది భక్తులు వస్తుంటారని, నగరం పరిశుభ్రంగా ఉంచాలంటే మీ చేతుల్లోనే ఉందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కోసం అందరం కలిసి పనిచేయాలన్నారు. ఆలయ అర్చకుల యోగక్షేమాలపై ఆరాతీశారు. కపిలేశ్వరుడికి కైంకార్యాలు ఎంత పవిత్రంగా పనిచేస్తారో, ఆలయ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం కపిలేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతితో చంద్రబాబు



సీఎం చంద్రబాబు ప్రజావేదిక ప్రాంగణంలోకి అడుగుపెట్టింది మొదలు వెనుదిరిగే వరకూ యువత, మహిళలు నినాదాలు, చప్పట్లు, ఈలలు, కేకలతో హోరెత్తించారు. సీఎం ప్రాంగణంలోకి వచ్చి స్టాల్స్ పరిశీలిస్తున్నంత సేపూ ఆ దృశ్యాలు వేదిక పక్కన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. వాటిని చూస్తూ జనం హర్షధ్వానాలు చేశారు. సీఎం వేదిక మీదకు వచ్చాక ఆయన ప్రసంగం కొనసాగినంత సేపూ ఈలలు, కేకలు, నినాదాలతో పాటు ప్లకార్డులు చూపుతూ

ఉరకలెత్తిన యువత

సందడి చేశారు. ప్రజలను ప్రశ్నించి సమాధానాలు రాబట్టేందుకు యత్నించినప్పుడల్లా రెట్టింపు ఉత్సాహంతో జనం స్పందించారు. ప్రజావేదికలో పాల్గొన్న వారిలో అత్యధికులు మహిళలు, విద్యార్థులే కావడంతో కార్యక్రమం కొనసాగినంత సేపూ వారి కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. వారి స్పందన చూసి సీఎం సైతం అంతే ఉత్సాహంతో ప్రసంగాన్ని కొనసాగించారు.

ప్రజావేదికలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధరవర్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

"వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి ప్రజలు ఏనాడైనా ప్రశాంతంగా నిద్రపోయారా? తిరుపతి నగరప్రజలకు తెలుగు గంగ నీరిచ్చింది ఎవరు? నగరానికి గరుడ వారధి తెచ్చింది ఎవరు? తిరుపతిలో పాతుకుపోయిన రౌడీలను నిర్మూలించి వారి గుండెల్లో నిద్రపోయిన పార్టీ తెలుగుదేశం"

తిరుపతి నగరం అధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా ఆర్థికంగానూ ఎదగాలి. భారతదేశానికి ఆదర్శం కావాలి.



పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందిస్తున్న ముఖ్యమంత్రి





ప్రజావేదిక కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగం - పాల్గొన్న అతిథులు, తిరుపతివాసులు



పుష్కరిణిలో భక్తుల రద్దీ



అఖిలాండం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తిరుమల కిటకిట

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతునే ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లుతో పాటు నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటలు, స్లాటెడ్ సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం భక్తులు దాదాపు మూడు గంటల దర్శన సమయం పడుతోంది. అఖిలాండం, ఆస్థానమండపం, లడ్డూకేంద్రం, అన్నప్రసాద భవనం, ఆర్టీసీ బస్టాండ్, గదులు కేటాయించే కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో యాత్రికులు కిక్కిరిసిపోయారు. కాలినడకన వచ్చే భక్తులు కూడా అధికంగానే ఉన్నారు.మరోవైపు స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్, విష్ణునివాసం, శ్రీనివాసం కేంద్రాలు రద్దీగానే దర్శనమిస్తున్నాయి.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,093
తలనీలాలు సమర్పించినవారు: 31,570
- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి నెలపాటు పుష్కరిణిలోకి నో ఎంట్రీ

తిరుమల, జూలై19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా జూలై 20 నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు తిరుమల శ్రీవారి పుష్కరిణిలోకి భక్తులను అనుమతించరు. ఈ నెలరోజులూ పుష్కరిణి హారతి కూడా ఉండదు. సెప్టెంబరు 24వ నుంచి బ్రహ్మోత్సవాలు న్నందున మరమ్మతులు చేపడుతున్నారు.


ఐఐటీ స్నాతకోత్సవం నేడు



ఐఐటీ ప్రాంగణం

ఏర్పేడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం ఏడవ కాన్వొకేషన్ జరగనుంది. దీనికి ముఖ్యఅతిథిగా కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకుడు, క్రియా యూనివర్శిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్ హాజరుకానున్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, ఎండీ సజ్జన్‌జిందాల్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ హోదాలో హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రతిభ కనబరచిన ఇంజనీరింగ్ విద్యార్థులకు అవార్డులను, డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఈ ఉన్నత విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

ఆడికృత్తికకు ఏర్పాట్లు పూర్తి



విజ్ఞానగిరి వద్ద విద్యుత్ దీపకాంతులు

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం విజ్ఞానగిరిపై శ్రీవళ్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి ఆడికృత్తిక ఉత్సవం ఆదివారం జరగనుంది. దీనికోసం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేకువజామున స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 9 గంటలకు ఉదయం ఇంద్ర విమాన సేవ, రాత్రి మయూర వాహన సేవ జరగనుందని ఈవో బాపిరెడ్డి తెలిపారు.

నేడు యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ ఆధ్వర్యంలో కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం సంబంధిత అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. పరీక్షలు మూడు కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 1,052మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పేపర్-1 ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలన్నారు. సమావేశంలో యూపీఎస్సీ అబ్జర్వర్ కౌలేష్ గౌతమ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోతి దాడిలో చిన్నారికి గాయాలు

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉడమలపాడులో కోతుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. గడచిన పదిరోజుల వ్యవధిలో ఓ కోతి దాడిలో ఆరుగురు గాయాలపాలయ్యారు. తాజాగా శనివారం సురేంద్రబాబు నందిని దంపతుల ఏడాదిన్నర పాప విహితపై విరుచుకుపడింది. ఇంటి వద్ద ఆడుకుంటుండగా చిన్నారి చేతిని రక్కేసింది. గాయపడిన పాపను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమారు 10కుట్లు పడినట్లు సమాచారం. గ్రామంలో కోతుల బెడదను తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆస్పత్రి వద్ద తల్లితో విహిత

భార్యను హతమార్చి.. ఆత్మహత్య

● దంపతుల విషాదాంతంతో అనాథలైన చిన్నారులు



హతురాలు ఉష - ఆత్మహత్య చేసుకున్న లోకేశ్వర్



తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): స్పర్థల నేపథ్యంలో భార్యను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్నాడో వ్యక్తి. తిరుపతి రూరల్ మండలం మంగళం రిక్షా కాలనీలో శనివారం జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలయ్యారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ బొమ్మల క్వార్టర్స్‌కు చెందిన ఉష(34)కు గంగాధర నెల్లూరు మండలం ఠాణాకు చెందిన లోకేశ్వర్‌తో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి తొమ్మిదవ తరగతి చదువుతున్న కుమారుడు, ఏడవ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఉష కరకంబాడిలోని అమరరాజా ఫ్యాక్టరీలో పనిచేసేది. లోకేశ్వర్ కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా ఈ దంపతుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. గొడవలతో ఆమె పలుసార్లు పుట్టింటికి వెళ్ళిపోయేది. ఇటీవల గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలోనే గత నెల 30న ఉష పుట్టింటికి వెళ్ళి పోయింది. లోకేశ్వర్ అక్కడే చిన్న గది అద్దెకు తీసుకుని ఉండేవాడు. ఈనేపథ్యంలో అతను భార్యను హతమార్చాలని పథకం పన్నాడు. శనివారం ఉదయం 5 గంటలకు డ్యూటీకి వెళ్లేందుకు కంపెనీ బస్సు కోసం వస్తున్న ఉషపై కత్తితో దాడి చేశాడు. గొంతుకోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత లోకేశ్వర్ ఇంటికి వెళ్ళి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలిద్దరూ అనాథలుగా మిగలడం స్థానికులను కలచివేసింది. ఘటనా స్థలాన్ని అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పరిశీలించారు. మృతదేహాలను రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



టెంకాయ చిప్పలతో కళాకృతులు రూపొందించే స్టాల్ సందర్శిస్తున్న సీఎం



కంచి కామకోటి మఠంలో విద్యార్థులతో ఫొటో దిగిన చంద్రబాబు



కపిలేశ్వరస్వామి ఆలయ అర్చకుడితో మాట్లాడుతున్న సీఎం

భవితకు 'బంగారు' విజన్

- రెండు కుటుంబాల మొర ఆలకించిన సీఎం
- బిడ్డల చదువుకు ముందుకొచ్చిన మార్గదర్శులు

తిరుపతి(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి): బాగా చదివే బంగారం లాంటి పిల్లలు. కానీ చదివించే స్థోమతే లేదు. అలాంటి రెండు నిరుపేద కుటుంబాల ఆవేదనను సీఎం చంద్రబాబు విన్నారు. వారి చదువుకు సాయం అందించేందుకు రోటరీ క్లబ్, రాస్ సంస్థలు మార్గదర్శులుగా ముందుకొచ్చాయి. ఇలాంటి పిల్లలకు 'బంగారు' భవితను అందించే విజన్‌కు సంబంధించి బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో శనివారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ ప్రయత్నం ఇంతటితో ఆగదని, తానేకాదు... తెలుగు దేశం పార్టీ ఉన్నంత వరకు ఈ పీ4 కార్యక్రమం సాగుతుందని స్పష్టం చేసారు.

సర్.. సాయం అందిస్తే డాక్టరవుతా



నాపేరు వినిత. మాది తిరుపతి నగరం గిరిపురం. బైపీసీ చదివాను. వెయ్యికి 986 మార్కులు సాధించా. నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని మెడిసిన్ చదవాలన్నది నా ఆశయం. మా నాన్న డి.హరిబాబు 2021లో కరోనాతోను.. అంతకుముందే అమ్మ నాగసులోచన అనారోగ్యంతో మృతి చెందారు. నాన్నమ్మ, తాతయ్య కష్టపడి ఎలాగోలా ఇప్పటివరకు నన్ను, చెల్లెలు అనిత, తమ్ముడు గణేష్‌ను చదివించారు. నేను డాక్టర్ అవ్వాలి. ఇంటర్ చదువుతున్న చెల్లెలు, టెన్త్ చదువుతున్న తమ్ముడికేమో సివిల్స్ సాధించి సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్ష ఉంది. మీరు మాకు సాయంచేస్తే ఉన్నత స్థానానికి చేరి మాలాంటి వారికి సాయం అందిస్తాం.

\- ఇదీ సీఎం చంద్రబాబుతో ఓ బంగారు బిడ్డ మాట

సమాజాన్ని భాగస్వామ్యం చేస్తే..

'ఇది బంగారు కుటుంబం. తల్లిదండ్రులు లేకపోయినా కష్టపడి బాగా చదువుతున్నారు. పైచదువులు చదివే స్థోమత వారికి లేదు. ఇలాంటి వారెందరో ఉన్నారు. నేను సాయంచేస్తే ఒకరో ఇద్దరికో చేయగలను. కానీ, సామాజిక బాధ్యత కలిగిన వారిని భాగస్వాములను చేస్తే.. మరెందరికో సాయం అందించి మార్గదర్శులుగా నిలుస్తారు. వారి అండతో ఉన్నత శిఖరాలకు చేరినవారు మరో పదిమందికి సాయం అందించి సమాజాన్ని తీర్చిదిద్దుతారు. అందుకే 'బంగారు కుటుంబం.. మార్గదర్శి' కార్యక్రమం నా మదిలో మెదిలింది. ఆ ఆలోచనకు అనుగుణంగా వినిత బంగారు కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ఓ మార్గదర్శి ముందుకు వచ్చారు' అంటూ వినితను, ఆమె చెల్లెలు, తమ్ముడిని వేదికపై నుంచి సీఎం చంద్రబాబు చూపుతూ మాట్లాడారు.

మంచి వేదికను ఇచ్చారు

వినిత కుటుంబానికి సాయం అందించే మార్గదర్శిగా తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.రాజేంద్రశెట్టి ముందుకొచ్చారు. 'సాయం చేయాలని చాలామందికి ఉంటుంది. దానికి ఓ వేదికంటూ లేకపోవడంతో ఎవరికి సాయం చేయాలన్నది అర్థంకాని విషయంగా ఉంటుంది. ముఖ్యమంత్రి విజన్‌లో భాగంగా రూపొందిన ఈ కార్యక్రమం అందుకు చాలా ఉపకరిస్తుంది. సాయం కావాల్సిన వారు.. అందించేవారు ముందుకొస్తారు. దీనిద్వారా భవిష్యత్తులో అణగారిన వర్గాలు అభివృద్ధిలోకి వస్తాయి. వినిత, ఆమె చెల్లెలు, తమ్ముడి చదువు బాధ్యతను తిరుపతి రోటరీ క్లబ్ భరిస్తుంది' అని చెప్పారు.

సర్, నా బిడ్డలను చదివిస్తే చాలు



నాపేరు కె.ఈశ్వరి. తిరుపతి నగరం సింగాలగుంట. అనారోగ్యంతో నా భర్త మృతిచెందారు. నా కుమారులు రాహుల్ 8వ, చైతన్య 5వ తరగతి చదువుతున్నారు. వాళ్లు బాగా చదువుతున్నా.. చదివించే స్థోమత నాకు లేదు. నా బిడ్డల చదువుకు సాయం చేయండి.

\- ఇదీ ఓ బంగారు తల్లి అభ్యర్థన

ముందుకొచ్చిన 'రాస్'

ఏమ్మా తల్లికి వందనం ఇద్దరు బిడ్డలకూ వచ్చిందా అని సీఎం చంద్రబాబు కుమారిని అడగ్గా వచ్చిందని చెప్పారామె. గతంలో ఒకరికే ఇచ్చేవారని, ఇప్పుడు పిల్లలందరికీ ఇస్తున్నామని చెప్పారు. ఈశ్వరి కుటుంబానికి సాయం అందించేందుకు 'రాస్' ముందుకు వచ్చిందంటూ ఆ సంస్థ ప్రతినిధిని పరిచయం చేశారు. 'ఈ ఇద్దరి పిల్లలకు 'రాస్' మంచి విద్యను అందించి ప్రయోజకులను చేస్తుంది. బ్యూటీషియన్ కోర్సుపై ఈశ్వరి ఆసక్తి చూపుతున్నందున, ఆమెకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం. సీఎం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఇలా సాయపడే అవకాశం రాస్‌కు కలిగినందుకు సంతోషంగా ఉంది' అని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

సింగపూర్ తరహాలో వ్యర్థ నీటి వినియోగం

అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు ఆదేశం ● తూకివాకం ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రం పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి నగరం సహా 50 కిలోమీటర్ల పరిధిలో సేకరించిన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీప్లాంట్ సద్వినియోగం చేసుకునేలా చూడండి. వ్యర్థ నీటిని వృథా కానివ్వకుండా సింగపూర్ తరహాలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోండి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. బయోమిథనైజేషన్ గ్యాస్‌ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల యూనిట్లను సందర్శించారు. రీసైక్లింగ్ కోసం వచ్చిన ఘనవ్యర్థాలను వినియోగించుకున్నాక వేస్ట్‌ను ఎనర్జీప్లాంట్‌కు తరలించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను, కూరగాయాల మార్కెట్ నుంచి వచ్చిన తడి, పొడి చెత్తను, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్‌ను సీఎం పరిశీలించారు. వినియోగించిన నీటిని ఎలా సద్వినియోగం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విశాఖతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు సూచించారు. తిరుపతిలోని హోటళ్ల నుంచి సేకరిస్తున్న 50 టన్నుల వ్యర్థాలను రోజూ శుద్ధి చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య సీఎంకు వివరించారు. ఇళ్లు, మార్కెట్‌నుంచి సేకరించిన కూరగాయల వ్యర్థాలతో ఎంతమేర ఎరువులను తయారు చేస్తున్నారని సీఎం అడిగారు.

290 ఎకరాల్లో ఇంత మంచి ప్లాంటా!

తూకివాకంలో 290 ఎకరాల్లో ఇంత మంచి ప్లాంటు ఉందా అని సీఎం చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2018లో మీ హయాంలోనే స్మార్ట్ సిటీ నిధుల కింద ఈ ప్లాంటు రూపుదాల్చిందని అధికారులు సీఎంకు గుర్తుచేశారు. ఈ ప్లాంటును పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. బ్యాటరీ వాహనంలో సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు తూకివాకంలోని ప్లాంట్‌లో 20 నిమిషాలపాటు కలియదిరిగారు. సీఎం వెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, జేసీ శుభం బన్సల్, ప్రిన్సిపల్ సెక్రటరీలు అనిల్‌కుమార్, సురేష్, ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తూకివాకం వద్ద ప్లాంటు పరిశీలిస్తున్న సీఎం

సాంకేతిక సమస్యతో ఎయిర్ ఇండియా విమానం రద్దు

రేణిగుంట, జూలై19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యతో ఎయిర్ ఇండియా విమానం రద్దయింది. శనివారం ఉదయం 7.15 గంటలకు హైదరాబాదు నుంచి తిరుపతికి రావాల్సిన ఈ విమానం శంషాబాద్ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రద్దు చేశారు. దీంతో తిరుపతి నుంచి హైదరాబాదుకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బు రీఫండ్ చేస్తామని, అత్యవసరమైతే మధ్యాహ్నం ఫ్లైట్‌కు లేదంటే రేపు ఉదయం పంపుతామని ఎయిర్ ఇండియా యాజమాన్యం ప్రయాణికులకు తెలిపింది.

తిరుపతి ఎస్బీ డీఎస్పీగా వెంకటనారాయణ



తిరుపతి (నేరవిభాగం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్బీ డీఎస్పీగా వెంకటనారాయణను నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈయన తిరుపతి డీఎస్పీగా కొన్ని నెలల పాటు పనిచేశారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా బైరాగిపట్టెడ వద్ద జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. ఇప్పటి వరకు పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఆయనకు.. ఈ బదిలీల్లో తిరుపతి ఎస్బీ డీఎస్పీగా నియమించారు. రెండు రోజుల్లో బాధ్యతలు ఆయన స్వీకరించనున్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఈయనకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించడానికి అవసరమైన ప్యానల్ జాబితా సిద్ధమైంది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. కాగా, ఎస్ఐ హోదాలో తిరుమల టూటౌన్, వెదురుకుప్పం, పీటీఎం, తిరుపతి వెస్ట్, విజిలెన్సు సివిల్ సప్లయిస్, తొట్టంబేడు, తిరుపతి ఈస్ట్, మదనపల్లె వన్‌టౌన్‌లో పనిచేశారు. పదోన్నతిపై నిజామాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగంలో సీఐగా పనిచేశారు. టీటీడీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సులో, తర్వాత సత్యవేడు, పాకాల, రాయచోటి సీఐగా విధులు నిర్వర్తించారు. పదోన్నతిపై డీఎస్పీగా తిరుపతి ట్రాఫిక్‌కు, గుంటూరు రూరల్ ఎస్బీ, విజయవాడ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసిన ఆయన కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుపతి నగర డీఎస్పీగా పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయనకు జిల్లాపై అవగాహన ఉంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు





మంత్రి నారాయణ - మణిశర్మ

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, సంగీత దర్శకుడు మణిశర్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

బుద్ధుడితో నా ప్రయాణం

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శన





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం సందేశాత్మకంగా ఉంది. బౌద్ధం నేపథ్యంగా సాగిన ఈ నాటకాన్ని చల్లప్ప మేస్త్రీ స్మారక అంబేడ్కర్ భవన్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, బుద్ధిస్ట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించాయి. నాటకాన్ని వీక్షించిన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ.. బౌద్ధం మంచి జీవన విధానాన్నీ, స్వేచ్ఛ, సమత, కరుణ, దయను మనిషికి అలవరుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను మనిషికి అందించిన మహోన్నతుడు బుద్ధుడని కొనియాడారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ.. బౌద్ధం సామాజిక చైతన్యాన్ని కలిగించిందన్నారు. రిటైర్డు జడ్జి గుర్రప్ప, అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు డాక్టర్ పరమశివన్‌లు మాట్లాడారు. నాటకాన్ని వీక్షించిన వారిలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి, కృష్ణ, పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.



తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ముగిసిన నానీ తల్లి అంత్యక్రియలు

పాకాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలు శనివారం పాకాల మండలం పులివర్తి వారిపల్లెలో శనివారం నిర్వహించారు. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం లక్ష్మీభారతి కన్నుమూయగా, ఆమె పార్థివదేహాన్ని వీరి స్వగ్రామం పులివర్తివారిపల్లెకు తీసుకొచ్చారు. శనివారం మధ్యాహ్నం వ్యవసాయక్షేత్రంలో నిర్వహించిన అంతిమ సంస్కార కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు, బంధువులు, స్థానికులు పాల్గొని నివాళులు అర్పించారు.

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తుడు

- చికిత్స పొందుతూ మృతి

తిరుమల, జూలై19(ఆంధ్రజ్యోతి): మూడురోజుల క్రితం తిరుమలలో అస్వస్థతకు గురైన ఓ భక్తుడు తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకలోని మాలూరుకు చెందిన వేణుగోపాల్(45) ఈనెల 17న సర్వదర్శన క్యూలైన్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తొలుత అశ్విని ఆస్పత్రికి తర్వాత స్విమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్, గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో.. పెళ్ళకూరుకు చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సత్యవేడుకు చెందిన డి.బీరేంద్ర వర్మ, ఓడూరు గిరిధర్‌రెడ్డి, కోడూరు కల్పలతారెడ్డి, చిత్తూరు పార్లమెంటులో.. పుంగనూరుకు చెందిన ఎన్.అనీషారెడ్డి, ఎన్.వెంకటరెడ్డి యాదవ్, పెనుమూరుకు చెందిన మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, బైరెడ్డిపల్లికి చెందిన మొగసాల కృష్ణమూర్తి నియమితులయ్యారు. వీరు రాష్ట్ర కార్యదర్శులైనా సంబంధిత పార్లమెంటు నియోజకవర్గాలకే వీరి కార్యకలాపాలు పరిమితమై వుంటాయి. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుని అసెంబ్లీ సెగ్మెంట్లలో రీజనల్ కో ఆర్డినేటర్లకు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరిస్తారని వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

నంది సర్కిల్లో సందడి

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయం వద్ద నంది సర్కిల్‌కు మధ్యాహ్నం 1.20 గంటలకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. కాన్వాయ్ నిలిపి కార్యకర్తలకు సీఎం అభివాదం చేశారు. తెలుగు మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. జైబాబు నినాదాలతో హోరెత్తించారు. అక్కడే ఉన్న ప్రత్యేక బస్సులోకి చంద్రబాబు వెళ్లారు. స్థానిక నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులను బస్సులోకి పిలిపించుకున్నారు. కలసి భోజనం చేశారు. అనంతరం కపిలేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. దాదాపు రెండు గంటల పాటు కపిలతీర్థం వద్ద సీఎం గడపడంతో కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 19(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పలువురు పారిశుధ్య కార్మికులను ప్రజావేదికపై సీఎం చంద్రబాబు సన్మానించారు. సత్కారం పొందిన వారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్ ఎన్. ఏకాంబరం, పీహెచ్ వర్కర్ శ్రీనివాసులు, వార్డు శానిటేషన్ వర్కర్ గణేష్‌బాబు, ఇతర కార్మికులు అజయ్ సాధినేని, రాఘవ, వి. చంచయ్య, కె.సుమతి ఉన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు తిరుపతికి రావడం గర్వకారణమని, అందుకు కారణం పారిశుధ్య కార్మికులేనని సీఎం కొనియాడారు.

ఎయిర్‌పోర్టు వద్ద కాలువలో పడి గాయాలు

- చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు



గాయపడిన వెంకటేశ్వరరావు

వడమాలపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం రేణిగుంట విమానాశ్రయం వద్ద టీడీపీ నాయకుడొకరు గాయపడ్డారు. పాపరాజుకండ్రిగకు చెందిన గొర్ల వెంకటేశ్వరరావు చంద్రబాబును చూడాలనే ఉత్సాహంతో ఎయిర్‌పోర్ట్ వద్ద మురుగు నీటి కాలువ పైన నడుస్తూ పడిపోయారు. సిమెంట్ దిమ్మె కూలిపోయి నీటి కాలువలో పడిపోయారు. దిమ్మె ఇనుప కమ్మీలు గుచ్చుకొని కుడి పాదం తెగి తీవ్ర రక్తస్రావమైంది. అధికారులు గుర్తించి వెంటనే ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే గాలి. భానుప్రకాష్‌పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా బాధితుడి ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

రేణిగుంట,(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు వద్ద పలువురు సీఎంకు తమ గోడు వివరించారు. వారి నుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. పింఛను తొలగించారని, వైద్య సహాయం చేయాలని, ఇలా రకరకాల అభ్యర్థనలను చంద్రబాబు సామధానంగా విన్నారు. సానుకూలంగా స్పందించారు.

- ఎయిర్‌పోర్టు వీఐపీ గ్యాలరీకి తమరె అనుమతించలేదని అడిషనల్ ఎస్పీపై కొందరు టీడీపీ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- రేణిగుంట ఎన్టీఆర్ కూడలిలో చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.

చంద్రబాబుకు నీరాజనం

- ప్రశాంతంగా ముగిసిన పర్యటన



తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు శనివారం తిరుపతిలో జన నీరాజనం పలికారు. పలుచోట్ల రోడ్లకు ఇరువైపులా నిలబడి పూలు చల్లుతూ స్వాగతించారు. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకోగా సీఎం వాహనంపై పూల వర్షం కురిపించారు. మహిళలు సెల్ఫీలు తీసుకున్నారు. ఇక, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రజావేదిక సభ వద్దకు రాగానే విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున చంద్రబాబు జిందాబాద్ అంటూ ఈలలు, కేకలు వేస్తూ నినాదాలు చేశారు. ఒక దశలో వారిని కంట్రోలు చేయడానికి పోలీసులకు సాధ్యపడలేదు. తిరుపతిలో ఏడు గంటల పాటు సాగిన సీఎం పర్యటన జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలతో ప్రశాంతంగా ముగిసింది. ప్రతి చోటా అదనపు ఎస్పీల స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు ఎప్పటి కప్పుడు సంబంధిత అధికారులు, పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు వైర్‌లెస్ సెట్ ద్వారా పర్యవేక్షించారు.

పోలీసు అధికారులపై రాష్ట్రప్రభుత్వ వేధింపులు

- రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐకి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖలు

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్‌లు, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు, జీతాలు ఇవ్వకుండా ఏపీ ప్రభుత్వం వేధిస్తోందని వైసీపీ ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. ఈ అంశంలో వెంటనే జోక్యం చేసుకుని కూటమి ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతున్న అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌కి లేఖలు రాశారు. గతేడాది జూన్ నుంచి నలుగురు ఐపీఎస్‌లు సహా 199 మంది అధికారులను కూటమి ప్రభుత్వం వెయిటింగ్‌లో ఉంచిందని అన్నారు. ఏపీ ప్రభుత్వం రాజ్యాంగా విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పోస్టింగ్‌లు, జీతాలు ఇవ్వకుండా అధికారులపై తీవ్ర వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓవైపు అధికారుల కొరత ఉందని చెబుతున్న ఏపీ ప్రభుత్వం.. చాలా మంది అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వడం లేదని అన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని అధికారులకు జీతభత్యాలు, పెన్షన్లు చెల్లించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు.

కత్తితో దాడి: యువకుడికి గాయాలు



గాయపడిన వేణుగోపాల్

తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాద నేపథ్యంలో జరిగిన దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ రామయ్య కథనం మేరకు.. నేపాల్‌కు చెందిన సుమన్, సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన ఎం. వేణుగోపాల్ లు వేర్వేరు హోటళ్లలో వంట మాస్టార్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ ఒకే రూములో ఉంటున్నారు. తరచూ గొడవపడేవారు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి రూంలో పరస్పరం కొట్టుకున్నారు. సుమన్ ఆగ్రహంతో కూరగాయల కత్తితో వేణుగోపాల్‌పై దాడి చేశాడు. గొంతు, చాతిపై పొడిచాడు. తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్‌ను స్థానికులు వెంటనే రుయాస్పత్రికి తరలించారు. సీఐ రామయ్య, ఎస్ఐలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు సుమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

తిరుపతి

ఎస్వీయూలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు



చెత్త ఊడుస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడవ శనివారం నిరంతరాయంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ఎస్వీ యూనివర్సిటీలో ఉత్సాహంగా సాగింది. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, ఐఏఎస్ఈ కాలేజీల వద్ద విద్యార్థులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలిగించారు. ప్రధాన గ్రంథాలయం వద్ద వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చెత్తను తొలగిస్తూ అక్కడి వారిని ఉత్తేజపరిచారు. యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. లైబ్రరీ డైరెక్టర్ సురేంద్ర బాబు, సీడీసీ డీన్ చెంద్రాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వివేక్ చౌదరి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, జూలై 19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును స్థానిక టీడీపీ నాయకులు శనివారం విమానాశ్రయంలో కలిశారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, మహేష్ యాదవ్‌లు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

వేతనాల పెంపుపై కృతజ్ఞతలు



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సదాశివం

తిరుపతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల వేతనం రూ.25వేలకు పెంచడం పట్ల సంబంధిత కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి పర్యటన కోసం శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎంను కలిసి నాయీ బ్రాహ్మణుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ గురించి సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. నాయీ బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఇంకా పలు సమస్యలను ప్రస్తావించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

● ఆకట్టుకున్న కళాకారులు



బాలనాగమ్మ పద్య నాటకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ కళా రూపాలను ప్రదర్శించిన కళాకారులు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అభినయ ఆర్ట్స్ - హనుమ అవార్డు రజతోత్సవం శనివారం ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖలు, టీటీడీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 27 వ తేదీ దాకా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. తెనాలికి చెందిన కళాకారులు పాడిన అన్నమాచార్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన గజేంద్ర ఆధ్వర్యంలో ప్రదర్శించిన బాలనాగమ్మ నాటకం అలరించింది. నెల్లూరుకు చెందిన క్రాంతి ఆధ్వర్యంలో 'ఫోటో' అనే నాటకం ప్రదర్శించారు. హైదరాబాదుకు చెందిన కళాకారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శించారు.

వర్షపు నీటి నిల్వకు ఏర్పాట్లు చేయండి

● సీఎంకు సామంచి విజ్ఞప్తి



విమానాశ్రయంలో సీఎంతో మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 19 (ఆంధ్రజ్యోతి): వర్షాల సమయంలో తిరుపతి, తిరుమల ప్రాంతాల నుంచి పారే నీటిని నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ సీఎం చంద్రబాబును కోరారు. శనివారం ఆయన తిరుపతి పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణం సందర్భంగా విమానాశ్రయంలో కలిసిన సాంచి శ్రీనివాస్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం వాగుల నుంచి వచ్చే వర్షపు నీరు వృథాగా పోతున్నాయని, నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటే తిరుపతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు.

23నుంచి స్కిల్స్, వృత్తిపై శిక్షణ

తిరుపతి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో వివేకానంద సెంటర్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ వృత్తిపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు ఇచ్చే శిక్షణకు గాను రూ.800చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. రోజూ ఉదయం 6.30నుంచి 8.30, సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం 9493107001, 6360150945లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వం మారినా

గుంతలు పూడ్చలేదు



రవీంద్రనగర్‌లో కొంకచెన్నయ్యగుంటకు వెళ్లే మార్గంలో గుంతలు తేలిన రోడ్డు

తిరుపతి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఒకటో డివిజన్ రవీంద్రనగర్ కొంకచెన్నయ్యగుంట రోడ్డు దారుణంగా తయారైంది. రెండేళ్లుగా గుంతల మయమైనా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారింది కదా.. రోడ్డు బాగుపడుతుందని స్థానికులు ఆశపడ్డారు. ఏడాది దాటినా వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహన దారులకు నరకం చూపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా నగరపాలక సంస్థ పట్టించుకున్న పాపానపోలేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయ వద్ద జడ్జి జస్టిస్ శ్రీనివాసులురెడ్డి

తిరుచానూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసులురెడ్డి, పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం

చంద్రగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 10.30 గంటలకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించాక శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవర్లను బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

తిరుచానూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో శనివారం సాయంత్రం నైషిత బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. దుబాయి నుంచి వచ్చిన రాజేష, నాయని, సోహిత, భవ్య, నైశిత, సహస్ర, కాశ్వీ, జోశ్విత, మోహనలు తమ నృత్యంతో ఆకట్టుకున్నారు. శిల్పారామం నిర్వాహకులు కళాకారులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

కొనసాగుతున్న లక్ష్మీకుబేర హోమం

రామచంద్రాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహర్షి ఆశ్రమంలో శనివారం లక్ష్మీకుబేర హోమం జరిగింది. 108 యజ్ఞకుండాల వద్ద 108మంది దంపతులు కూర్చుని శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. మరాఠీల ఆధ్యాత్మిక గురువు శాంతి గిరి జనా ప్రభువు ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించి భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు.

తిరువడిపురం ఉత్సవం ప్రారంభం

తిరుపతి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి తిరుమంజనం, ఇత్యాది కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, మేధినిపూజ, మత్స్యంగ్రహణం, అంకురార్పణ ఘట్టాలు నిర్వహించారు. టీటీడీ జియ్యంగార్లు, అర్చక స్వాములు, అధికారులు పాల్గొన్నారు.

మతోన్మాదుల ఆగడాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జూలై 19: దేశవ్యాప్తంగా పెరుగుతున్న మతోన్మాదుల ఆగడాలను అరికట్టడానికి కార్యకర్తలు రాజకీయ చైతన్యంతో కూడిన పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ 14వ నగర మహాసభలో భాగంగా రెండవ రోజు ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాదుల ఆగడాలను అరికట్టడానికి సైద్ధాంతికంగా బలపడాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో మత కలహాలు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన నిధులు మంజూరు చేయించుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విఫలమయ్యారని విమర్శించారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, శివ, మంజుల, చలపతి, బలరాం, ఎండీ ప్రసాద్, సి.పెంచలయ్య, ఉదయ్‌కుమార్, నదియా, గుర్రప్ప పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ దూరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధిని అవగాహనతో దూరం చేయవచ్చని డాక్టర్ విజయకుమార్ అన్నారు. ఎస్‌కేడీ నగర్‌లో శనివారం రాస్, శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ రీసెర్చ్ టాటా ట్రస్ట్ సంయుక్తంగా క్యాన్సర్‌పై ఉచిత అవగాహన సదస్సు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 25 నుంచి 65 ఏళ్లలోపు మహిళలు నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 100 మందికి రక్త, బీపీ పరీక్షలు చేశారు.

తిరుపతిలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయండి

● సీఎంకు డాక్టర్ హరిప్రసాద్ విజ్ఞప్తి

తిరుపతి, జూలై19(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటనకు వచ్చిన చంద్రబాబును ఆయన విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. హస్తకళాకారులు తయారు చేసిన తిరుమల శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. తిరుమలలో ఉన్న లేపాక్షి ఎంపోరియంను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని, తిరుపతిలోనూ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు.

తిరువీధుల్లో మార్మోగిన గోవిందనామ స్మరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరువీధుల్లో గోవిందనామ స్మరణ మార్మోగింది. ప్రతి శనివారమూ స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఉదయం గోవిందరాజస్వామి మాడ వీధుల్లో భజన కళాకారులు నగర సంకీర్తన చేపట్టారు. తిరునామాలు, సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం, చెక్క భజన, మేళ తాళాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

● వీధుల్లో హోరెత్తిన నీటి ప్రవాహం





తిరుపతి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం దంచికొట్టింది. మంగళంలో ప్రారంభమైన వాన క్రమంగా నగరం వైపు విస్తరించి భారీగా కురిసింది. పురవీధుల్లో నీటి ప్రవాహం హోరెత్తింది. పల్లపు ప్రదేశాలు నీట మునిగాయి. మురుగు కాలువలు పొంగుతూ ఉధృతంగా ప్రవహించాయి. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు రోడ్లపైకి కొట్టుకొచ్చాయి. సెంట్రల్ బస్టాండు, కూరగాయల మార్కెట్‌లో నీరు నిలిచాయి. చిరు వ్యాపారాలు మూతబడ్డాయి. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం మళ్లీ మొదలు కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఇళ్లకు చేరుకునే క్రమంలో తడిసిముద్దయ్యారు. అక్కడక్కడా చెట్లు నేలకూలాయి. గుంతల రోడ్లలో నీరు నిల్వ చేరడంతో రాకపోకలకు అవస్థలు తప్పలేదు. పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. మంగళంలోని తిరుమలనగర్, కేబీఆర్ నగర్‌లలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. కరకంబాడి రోడ్డు విద్యానగర్ మలుపు వద్ద ట్రాఫిక్ స్తంభించింది. నలువైపుల నుంచి వరదలా వర్షపు నీరు చేరింది. చెత్త, వాటర్ బాటిల్స్, ఇతర వ్యర్థాలు కొట్టుకొచ్చాయి. దీంతో వాహనదారులు ముందుకెళ్లడానికి సంకోచించి రోడ్డుపైనే ఆపేశారు. ఈ క్రమంలో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌లో అంబులెన్సులు సైతం ఇరుక్కుపోయాయి. వర్షం ఆగిన తర్వాత పరిస్థితి చక్కబడింది. వాతావరణం బాగా చల్లబడింది. బుధవారం 32.6, గురు 18.4, శుక్ర 74.6, శని వారం 60.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కష్టపడేవారినే

పదవులు వరిస్తాయి

● టీడీపీ నేతలతో చంద్రబాబు



తిరుపతి(నేరవిభాగం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'పదవుల కోసం వెంపర్లాడాల్సిన పనిలేదు.. కష్టపడి పనిచేస్తే వాటంతట అవే వస్తాయి' అని సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంటలోని విమానాశ్రయానికి వచ్చిన సీఎంకు టీడీపీ నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, హేమాంబరధరరావు, బుల్లెట్ రమణ, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం బాలసుబ్రహ్మణ్యంతో కాసేపు ముచ్చటించారు. కష్టపడి పనిచేసి తిరుపతిలో పార్టీని బలపరచాలని కోరారు. నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించండి



సీఎంకు సమస్యను వివరిస్తున్న సర్పంచ్ రమణ

తిరుచానూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ మండలం సాయినగర్, లింగేశ్వర్‌నగర్ పంచాయతీల్లో హథీరాంజీ మఠం భూముల్లో నివాసాలు ఏర్పరుచుకున్న ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించాలని సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ కోరారు. శనివారం ఆయన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యపై దృష్టి పెట్టాలని సీఎం కలెక్టర్‌కు సూచించారు.

● చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ అటవీ సమీప గ్రామాల్లో ఏనుగుల కట్టడికి కందకాలు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు.

కనకదుర్గమ్మకు దీపాలంకరణ

చంద్రగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ చేశారు.

స్వచ్ఛాంధ్రకు స్వచ్ఛందంగా...



ప్రజావేదిక ప్రాంగణంలోకి వెళుతున్న మహిళలు, యువకులు

తిరుపతి(జీవకోన), జూలై 19 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక ప్రాంగణానికి యువత పెద్ద సంఖ్యలో హాజరైంది. సీఎం చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు యువత పెద్దయెత్తున కేకలు వేస్తూ ఆస్వాదించారు. మహిళలు కూడా భారీగా హాజరయ్యారు. కాగా, ప్రజావేదిక ప్రాంగణం వద్దకు స్థానిక టీడీపీ నేతలు ర్యాలీగా వచ్చారు. ఇందులో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మహేష్‌యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, సుబ్బుయాదవ్, ధనంజయ ఉన్నారు. జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

బిల్లులు చెల్లించాలని చంద్రబాబుకు వినతి



కేవీబీపురం జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2017-18వ సంవత్సరంలో చేసిన సిమెంటు రోడ్ల పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని సీఎం చంద్రబాబును మండల టీడీపీ నాయకులు రేణిగుంట విమానాశ్రయంలో కలిసి విన్నవించారు. బిల్లులు వచ్చేలా చూడాలని ఆయన కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామానుజుల నాయుడు, తిరుపతి రైతు పార్లమెంటరీ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటరీ యువత అధికార ప్రతినిధి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అమర హాస్పిటల్లో సీపీ స్టెంట్ ద్వారా అట్రిక్ సిండ్రోమ్ శస్త్రచికిత్స విజయవంతం

రేణిగుంట జూలై 19(ఆంధ్రజ్యోతి): అమర హాస్పిటల్లో సీపీ అట్రిక్ సిండ్రోమ్ శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆస్పత్రి ఎండీ డీఎం కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ గురుజాల వైద్య బృందంలోని డాక్టర్లు నాగరాజు, సయ్యద్, హేమంత్ తెలిపారు. 49 ఏళ్ల ఓ మహిళ నాలుగేళ్లగా టీవీ, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడేదని పేర్కొన్నారు. శనివారం ఆమెకు వైద్య పరీక్షలు చేయగా అండం బ్లాక్ జ్ ఉన్నట్లు గుర్తించామన్నారు. క్లిష్టమైన ఈ సమస్యను అత్యాధునిక వైద్య సాంకేతికత అయిన కవర్డ సీపీ స్టెంట్ విధానంతో శస్త్రచికిత్స చేయగా విజయవంతం అయిందన్నారు. ఇప్పుడు పేషంట్ రక్తపోటు స్థిరంగా ఉందని వివరించారు. ఈ మేరకు ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంక్షేమం కూటమికే సాధ్యం

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కంఠా వీధిలో టీడీపీ నాయకులు పర్యటించారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా సీసీరోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠా రమేష్, పేట బాలాజీ, మండల రామమూర్తి, రాము, సందీప్, అనిల్, కాసరం రమేష్, పద్మజ, వివేక్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తీశ్వర, జూలై 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామచంద్ర డి హడ్డర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పింఛన్ల పంపిణీలో సాంకేతిక సమస్యను పరిష్కరించండి



చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న మునిరాజానాయుడు

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రేణిగుంటలో శనివారం సీఎం చంద్రబాబును తొట్టంబేడు టీడీపీ మండలాధ్యక్షుడు రాల్లి మునిరాజానాయుడు కలిశారు. పింఛన్ల పంపిణీలో కొందరికి వేలిముద్రలు పడడం లేదని, ఐరిష్ పనిచేయలేదని తెలియజేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఆదేసమయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సమస్యను క్లుప్తంగా వివరించారు. స్పందించిన సీఎం జిల్లాలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యే లబ్ధిదారులకు ముఖగుర్తింపు కార్డుల ద్వారా పింఛన్లను పంపిణీ చేయాలని సూచించారు.

పుత్తూరు వార్తలు

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర

పుత్తూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సంచుల స్థానంలో గుడ్డ సంచులను వినియోగించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి కోరారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత, మొక్కలను నాటడం కార్యక్రమాలను నిర్వహించారు. ● అలాగే స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పదివేల రూపాయల విలువ చేసే విద్యాసామగ్రిని సతీష్ బాబు కుటుంబ సభ్యులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

పుత్తూరు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని మున్సిపల్ కమి షనర్ మంజునాథ్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సంయుక్తంగా ప్లాస్టిక్ నియంత్రణపై మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విధులకు సక్రమంగా హాజరు కాలేదు: ఎంపీపీ

పుత్తూరు టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయం సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులకు హాజరుకాని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీడీవో వాణి స్పందిస్తూ సచివాలయ సిబ్బంది బదిలీలు జరుగుతున్నందున విధులకు సక్రమంగా హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. సర్పంచులు మురళీమోహన్, వెంకటేష్, బొబ్బిలి యాదవ్ మాట్లాడుతూ నిధులు లేక గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు జీతాలు ఇవలేకపోతున్నామని తెలిపారు. ఎంఈవో తిరుమలరాజు, డిప్యూటీ మేనేజర్ మంగమ్మ, వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, విమలమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు మోహన్‌రాజు, కరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

పుత్తూరు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ సిబ్బంది ధర్నా నిర్వహించారు. కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రసన్న వెంకన్న సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



వడమాలపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేశీనేనికోలుకొల్లి శనివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్ రాజు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట,జూలై 19(ఆంధ్రజ్యోతి):అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

రాష్ట్రాభివృద్ధి అజెండాకు శ్రీసిటీ మద్దతు



చంద్రబాబుతో మాట్లాడుతున్న రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి అజెండాకు తమ మద్దతు ఉంటుందని శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి పునరుద్ఘాటించారు. తిరుపతిలో సీఎం చంద్రబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలి శారు. సీఎం, రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చలు తమకు ఎంతో విలువైనవని ఈ సందర్భంగా రవీంద్రసన్నారెడ్డి అన్నారు. పారిశ్రామికవృద్ధి, ఉపాధి సృష్టి ప్రయత్నా లకు ప్రభుత్వ ప్రోత్సాహంపోరందన్నారు. ఐఎంపీసీ ఎండీ జైఫో ఇవామి, ఇసాన్ ఆటో పార్ట్స్ ప్లాంట్ హెడ్ యుచి టోమిటులు సీఎంను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం

రేణిగుంట జూలై 19:(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మన స్వాగతం లభించింది. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం 11:42 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అనగాని సత్యప్రసాద్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యేలు బొజ్జలసుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, గాలి భాను ప్రకాష్, ఆదిమూలం, విజయశ్రీ, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, మురళీమోహన్, థామస్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు నరసింహ యాదవ్, సుగుణమ్మ, హరి ప్రసాద్, రుద్రకోటి సదాశివం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, కోదూరు బాలసుబ్రమణ్యం, ఆర్కేవో భానుప్రకాష్ రెడ్డి స్వాగతం పలికారు.

సాదర వీడ్కోలు

రేణిగుంట జూలై 19:(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు సాదర వీడ్కోలు లభించింది. శనివారం తిరుపతి జిల్లాలో ఒకరోజు పర్యటన ముగించుకున్న రాత్రి 7:42 నిమిషాలకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీహర్షవర్ధన్ రాజు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేసీ శుభం బన్సాల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశ, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆలయ ఈవో బాపిరెడ్డి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

ముక్కంటి సేవలో ఎంపీ శ్రీకాంత్ షిండే

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్‌షిండే కుమారుడు ఎంపీ శ్రీకాంత్‌షిండే దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్సీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు.

విలీనం వద్దంటూ... పాఠశాలకు తాళం



పాఠశాలకు తాళం వేసిన తల్లిదండ్రులు, మహిళలు

ఏర్పేడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మా ఊరి విద్యార్థులను మా ఊరి బడిలోనే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బడికి తాళాలు వేశారు. ఈ ఘటన ఏర్పేడు మండలంలోని పల్లంపేట దళితవాడలో చోటు చేసుకుంది. పల్లంపేట దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను పల్లం దళితవాడ పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే కిలోమీటర్ల మేర భద్రత లేని రోడ్ల మీద పిల్లలను పంపలేమని గత నె 25న సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు ర్యాలీ చేపట్టారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి అందోళనలు తీవ్రంగా ఉన్న చోట మినహాయి స్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అప్పటి నుంచి పల్లంపేట బడికే విద్యార్థులు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు హాజరు వేయడం లేదని, మధ్యాహ్న భోజనం అందజేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు శనివారం ఉదయం బడికి తాళం వేసి ముళ్లకంచెను ఏర్పాటు చేశారు.

యాళి వాహనంపై కుమారస్వామి రాజసం



శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి శనివారం ఉదయం యాళి వాహనంపై ఊరేగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం భరణి ఉత్సవం జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను యాళి వాహనంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరజనాలు సమర్పించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు రాష్ట్రో పాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తికి చెందిన శిరీష స్పోకెన్ సెంటర్ వారి సౌజన్యంతో విద్యా సామగ్రిని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు శిరీష, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, గజేంద్ర, బాలాజీ, బాలసుబ్రమణ్యం, సర్పంచ్ రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తుపాకుల వెంకటరాజు నాయుడుపేటలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనతో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ రాజీవ్‌నగర్‌కు చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయం చేశారు. టీడీపీ నాయకులు గురవయ్య, సురేష్, బత్తెయ్య, కస్తూర్ ఇన్‌చార్జి గాదిపాకం గోపీనాథ్, శివ, అరుణ్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై కుమారస్వామి



శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): విజ్ఞగిరికి వెలసినకుమారస్వామి శనివారం రాత్రి శేషవాహనంపై ఊరేగారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని పల్లమాల, బీఎన్‌కండ్రిగ, నెల వాయిలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం పాఠశాల సముదాయ శిక్షణ తరగతులు జరిగాయి. వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోందని బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

మొక్కలు పెంచండి

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంచడంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జనసేన నాయకులు అన్నారు. 'మన పర్యావరణ మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలం దిగువసాంబయ్య పాళెంలో మొక్కలు నాటారు. జనసేన నాయకులు పేట చిరంజీవి, పసల సురేష్, మణి, నవీన్, సాయి, చందు, మునిచంద్ర, మాతయ్య, వెంకటేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆదిమూలం



సత్యవేడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి పర్యటన నిమిత్తం శనివారం విచ్చేసిన చంద్రబాబును రేణిగుంట ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నియోజకవర్గ సమస్యలపైన వినతిపత్రం సమర్పించారు.

సత్యవేడు అభివృద్ధి నా బాధ్యత : శంకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

నాగలాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు అభివృద్ధి నా బాధ్యత. కచ్చితంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తా అని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగలాపురంలోని ఓ కళ్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన మండల సమావేశంతో ఆయన పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ ఆశయాలను గుణంగా పార్టీలో అందరితో కలిసి ముందుకు వెళతానన్నారు. అందరం విభేదాలు మాని రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పలు సమస్యలను శంకర్‌రెడ్డి వద్ద ప్రస్తావించారు. ప్రధానంగా నాగలాపురం - పిచ్చాటూరు వయా టీపీకోట, వీఆర్‌కండ్రిగ - టీపీ పాళెం రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. దాసు కుప్పం బైపాస్ రోడ్డు, సత్యవేడు బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లానని శంకర్‌రెడ్డి తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలో ఇంటింటా తిరుగుతూ సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌శెట్టి, ఎండీకుమార్, యాచేంద్ర నాయుడు, పార్టీబన్, ప్రసాద్‌రాజు, రామ్‌ప్రకాశ్, రుద్రయ్య, మనోజ్‌నాయుడు, బాలాజీ, జ్యోషన్, దాన్‌బాషా, బాబు, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, తిరుమల రెడ్డి, రామాంజులనాయుడు, మునస్వామియాదవ్, గోపీనాథ్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, శివకుమార్, చిన్న పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.